Andhra prabha

DL 10/01/14



# సకాలంలో పనులు పూర్తి చేయాలి

## ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు.. అధికారులకు మెట్రో రైల్ ఎండి ఎన్‌వియస్ రెడ్డి ఆదేశం



మెట్రోరైలు పనులను పరిశీలిస్తున్న ఎండి ఎన్.వి.ఎస్ రెడ్డి

**హైదరాబాద్, జనవరి 9(ఆఎన్ఎన్):** మెట్రో రైల్ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని హైదరాబాద్ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.వి.ఎస్.రెడ్డి ఆదేశించారు. గురువారం పబ్లిక్‌గార్డెన్ నుండి మొదలు నాంపల్లి, గాంధీభవన్, ఎం.జె.మార్కెట్ చౌరస్తా, జాంబాగ్, కోఠి, పుత్లీబౌలి మార్గాల గుండా జరుగుతున్న మెట్రో పనులను ఆయన కాలినడకన పరిశీలించారు. చాపల్‌రోడ్ చౌరస్తా నుండి నాంపల్లి రైల్వేస్టేషన్ మధ్యలో మెట్రో పనులు మొదలు కాకపోవడానికి కారణాలను ఆయన అధికారులను అడిగారు. ఎలాంటి ఆస్తులు అడ్డుగా లేని ఈ ప్రాంతంలో వెంటనే పనులను ప్రారంభించాలన్నారు. అనంతరం గాంధీ భవన్, ఎగ్జిబిషన్ గ్రౌండ్ల వద్ద మెట్రో పనులను పరిశీలించిన ఆయన పనులు పూర్తి కాగానే అక్కడ పేరుకుపోయిన మట్టిని, చెత్తను తొలగించడంతో పాటు అవసరం లేని చోట్ల ప్రజల సౌకర్యం కోసం బారికేడ్లను తొలగించాలన్నారు. జాంబాగ్‌లో పనులను పరిశీలించిన ఆయన రోడ్డు పక్కగా తొలగించిన తర్వాత కూడా మళ్లీ ఆక్రమణలు జరగడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. అదే సమయంలో రోడ్డుపై గుంతలు, ఇతర ఆటంకాలు ఏర్పడడం కూడా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నదని గమనించిన ఆయన రోడ్డు మరమ్మత్తు పనులను, ఆక్రమణల తొలగింపు పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాంబాగ్‌లో మెట్రో పనుల వల్ల కాకుండా రోడ్డు సమతలంగా లేకపోవడం వల్ల ట్రాఫిక్ జామ్ అవుతుందని నిర్ధారణకు వచ్చిన ఎండి రోడ్డు మరమ్మత్తులు యుద్ధప్రాతిపదికన చేపట్టడం ద్వారా వాహనాల తమ యధావిధి వేగంతో వెళ్లగలుగుతాయన్నారు. పలు చోట్ల విద్యుత్ స్థంభాలను మార్చడానికి అవకాశముందని గమనించిన ఆయన వాటిని వెంటనే మార్చి ట్రాఫిక్‌కు సహకరించాలని అధికారులను కోరారు. వి.వి.కళాశాల బయట రెండు విద్యుత్ స్థంభాలు రోడ్డుపైనే ఉండడంతో కొంత ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడుతుందని, కళాశాల యాజమాన్యం ఆ పోల్స్‌ను లోపలికి మార్చడానికి అనుమతించిందని అధికారులు తెలుపగా ఆ పనిని వెంటనే పూర్తి చేయాలని పురమాయించారు. అనంతరం ఉస్మానియా మెడికల్ కళాశాల మెట్రో స్టేషన్ పిల్లర్ పనులను ఆయన పరిశీలించారు. ఆస్తులకు అధికంగా నష్టం జరగకుండా సెంట్రలైజ్‌డ్‌గా స్టేషన్‌ను నిర్మిస్తున్నామని, రోడ్డు ఇరుకుగా ఉండడంతో సకాలంలో పనులు పూర్తి చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులకు వివరించారు. జాంబాగ్ రోడ్డు ఇరుకుగా ఉందని, రోడ్డు పక్క పలు ఆక్రమణలను ఇంతకు ముందే తొలగించి పనులు చేపట్టినప్పటికీ తిరిగి రోడ్లు ఆక్రమణకు గురౌతుండడంతో ఇబ్బందులు ఎదురౌతున్నాయన్నారు. కొన్ని ఆస్తులను తొలగించే విషయం న్యాయవివాదంలో ఉన్నప్పటికీ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాలను వెతుక్కుంటూ ముందుకువెళ్తున్నామన్నారు. ఒఎంసి స్టేషన్ వద్ద మొత్తం 10 పిల్లర్లు నిర్మాణం జరగాల్సి ఉండగా, 5 నిర్మాణాలు ప్రగతిలో ఉన్నాయన్నారు. ఒఎంసి స్టేషన్ ప్రత్యేక డిజైన్‌తో రూపుదిద్దుకుంటుందన్నారు.

అనంతరం ఆయన జాంబాగ్ నుండి కోఠి బస్టాండ్ వైపు వెళ్లే రహదారి క్రాసింగ్‌లో ఉన్న ట్రాఫిక్ ఎసిపి కార్యాలయం విషయం వాకబు చేశారు. ప్రత్యామ్నాయ కార్యాలయం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని, అవి పూర్తి కాగానే తరలించనున్నట్లు అధికారులు వివరించారు. అనంతరం కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాల చౌరస్తా వద్ద పనులను వెంటనే ప్రారంభించేందుకు తీసుకోవలసిన చర్యలపై అధికారులను ఆరా తీశారు. ఉస్మానియా మెడికల్ కళాశాలకు ఆనుకుని చౌరస్తా మూలగా ఉన్న తాత్కాలిక వ్యాపార నిర్మాణాలను తొలగించి, మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని అక్కడికో తరలిస్తే పనులను ప్రారంభించవచ్చని అధికారులు తెలుపగా, ఆ పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన ఉస్మానియా మెడికల్ కళాశాలకు సంబంధించిన ప్రహరీగోడ పూర్తిగా తొలగించకపోవడాన్ని గమనించి, దానిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రోడ్డుపై ఉన్న సులభ్ కాంప్లెక్స్‌ను తొలగించాలని, నిర్వాహకులే తొలగించేందుకు ముందుకు వస్తే అందుకయ్యే ఖర్చును కూడా ఇవ్వాలని అధికారులకు సూచించారు.